- పటిష్టంగా బీఆర్ఎస్ బూత్ కమిటీలు...
- అధునాతన పద్ధతిలో ప్రచారం...
- వార్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ

'బూత్' నుంచి బలోపేతం..

ముషీరాబాద్: 'మీ బూత్‌లలో మీరు గెలిచి నట్‌లెత్తే నేను గెలిచినట్లే' అని ప్రధాని నరేంద్రమోదీ చెప్పిన మాటలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు పట్టించుకున్నారో లేదో తెలియదు కానీ... ముషీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మాత్రం తూచా తప్పకుండా పాటిస్తుంది. కాలిగాయంతో ఇంటింటి ప్రచారానికి దూరంగా ఉంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ బూత్‌స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు అధునాతన నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటూ నిర్మాణాన్ని పటిష్టపరిచారు. దీనికి తోడు ఉదయం, రాత్రి వేళల్లో అపార్ట్‌మెంట్స్, బస్తీ, కాలనీల్లో కార్నర్లలో కమ్యూనిటీ మీటింగ్‌లు నిర్వహిస్తూ తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు.

పటిష్టంగా బూత్ కమిటీలు...

ప్రతి బూత్‌కు బూత్ ఇన్‌చార్జీతో పాటు 6-10 మంది చొప్పున బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 289 బూత్‌లు ఉండగా 2500-2900 మంది కార్యకర్తలు కిందిస్థాయిలో పని చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. వీరు ఉదయం, సాయంత్రం వేళల్లో తమ బూత్ పరిధిలో ఉన్న ఇంటింటికి తిరుగుతూ ఓటరు లిస్టులో వారి పేరు ఉందా, లేదా వెరిఫికేషన్ చేస్తూ ఓటు ఉంటే ఓటరు స్లిప్‌లను అందిస్తూ మరొకరు కరపత్రం ఇస్తూ స్టికర్లను అంటిస్తున్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధిని మరికొందరు వివరిస్తుంటారు.

ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు...

ఈ సర్వే వివరాలను మొత్తం అప్పటికే ఏర్పాటు చేసుకున్న వార్ రూమ్‌లోని సర్వర్‌లో సేవ్ అవుతాయి. వార్ రూమ్‌లో కూర్చుని నియోజకవర్గం వ్యాప్తంగా జరుగుతున్న తీరును పరిశీలించవచ్చు. ఎంత మంది బూత్ ఇన్‌చార్జీలు ఎన్ని కుటుంబాలను కలిశారు. ఇంకా ఎంత మందిని కలవాల్సి ఉంది. అనేది స్పష్టంగా పర్యవేక్షించవచ్చు. అంతేకాకుండా ప్రత్యేకంగా తయారు చేయించి ఓటర్ స్లిప్ మిషన్ ద్వారా అక్కడికక్కడే ముఠా గోపాల్ బొమ్మతో కూడిన ఓటర్ స్లిప్‌ను ప్రింట్ తీసి ఇవ్వవచ్చు(మీటర్ రీడింగ్‌ను చూసి కరెంటు బిల్లు ఇచ్చినట్లు).

ప్రతి మూడు పోలింగ్ బూత్‌లకు క్లస్టర్ ఇన్‌చార్జీ..

ప్రతి మూడు పోలింగ్ బూత్‌లకు కలిపి ఒక క్లస్టర్ ఇన్‌చార్జీగా సీనియర్ బీఆర్ఎస్ నాయకుడిని నియమించారు. ఇతను ఎప్పటికప్పుడు బూత్‌స్థాయిలో జరుగుతున్న పని తీరును వార్ రూమ్‌కు నివేదిక రూపంలో అందజేస్తారు. దాన్ని బట్టి వార్ రూమ్‌లో ఉన్న సీనియర్ నాయకులు ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేస్తారు. దీనికి తోడు ప్రతి డివిజన్‌కు ఇద్దరు ఎన్నికల ఇన్‌చార్జీలను, ఒక కోఆర్డినేటర్‌ను నియమించారు. వీరు ఎప్పటికప్పుడు పార్టీ నేతల మధ్య సమన్వయానికి కృషి చేస్తూ ఉదయం, రాత్రి వేళల్లో జరిగే కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ఇలా బీఆర్ఎస్ పార్టీ అధునాతన పద్ధతులను ఉపయోగించి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తుంది. ఇంత గట్టి నెట్‌వర్క్, పునాదులు కలిగిన బీఆర్ఎస్ పార్టీని వేరే పార్టీలు కదిలించగలవా అని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

యాప్‌లో సర్వే డీటైల్స్...



ఇంటింటికి వెళ్లే బూత్ ఇన్‌చార్జీలకు తమ సెల్‌ఫోన్‌లో ఒక యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఇచ్చారు. ఆ యాప్ ద్వారానే ఈ వెరిఫికేషన్ జరుగుతుంది. దాంతో పాటు సర్వే వివరాలను కూడా అందులో పొందుపరిచారు. ఓటరు పురుషుడా, స్త్రీ అనే వివరాలతో పాటు అతడు వ్యాపారస్తుడా, ఉద్యోగా, నిరుద్యోగా ఇలా అనేక ఆప్షన్‌లను అందులో ఉంచారు. అతను చెప్పిన వివరాలను అందులో పొందుపరచిన విధంగా ఇప్పటికే అతను ప్రభుత్వ పథకాలను అందుకుంటున్నాడా, ఏమి అందుకుంటున్నాడో కూడా యాప్ ద్వారా తెలుస్తుంది. ఒక వేళ ఏ పథకం అందుకోనట్‌లెత్తే ఏఏ పథకాలకు అతను అర్హుడో యాప్ చెబుతుంది. దీంతో పాటు బూత్ ఇన్‌చార్జీతో ఆ ఓటరు మాట్లాడిన తీరును బట్టి సానుకూలంగా ఉంటే స్టార్ గ్రీన్, పరవాలేదు.. అంటే గ్రీన్, వ్యతిరేకంగా మాట్లాడితే రెడ్ బటన్ నొక్కే ఆప్షన్‌లు అందులో ఉన్నాయి. సర్వే అయిన తరువాత సేవ్ ఆప్షన్‌ను నొక్కితే సర్వర్‌లో సేవ్ అవుతుంది.



బాగ్ అంబర్‌పేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్

ఆశీర్వదిస్తే అందుబాటులో ఉంటా

బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాలేరు పద్మ

అంబర్‌పేట్: అంబర్‌పేట్‌లో ప్రజా మద్దతుతో బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మ కుంట, నందనవనం కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. గత ఐదేళ్లలో అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తిరిగి ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతి గల్లీలో పేరు పేరునా పలకరిస్తూ ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. గోల్నాకలో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ సతీమణి కాలేరు పద్మ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేస్తూ భర్త విజయానికి సహకరించాలని కోరారు.

కాలేరుకు మద్దతుగా నల్లకుంటలో ప్రచారం

నల్లకుంట: మాజీ కార్పొరేటర్ వనం రమేష్, డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ మేడి ప్రసాద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు మద్దతుగా సోమవారం నల్లకుంట డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లిన నాయకులు, కార్యకర్తలు ఓటర్లను కలిసి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు ఎమ్మెల్యే కాలేరు చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కారు గుర్తుకు ఓటేసి కాలేరును రెండో సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అరుంధతినగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠాగోపాల్

అభివృద్ధి, సంక్షేమంలో రోల్ మోడల్

- ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠాగోపాల్
- నియోజకవర్గ పరిధిలో విస్తృత ప్రచారం
- పలు కాలనీలు బస్తీల్లో విశేష స్పందన



అన్నానగర్‌లో జీపుపై నుంచి ప్రసంగిస్తున్న ముఠాగోపాల్

చిక్కడపల్లి: అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్, అన్నానగర్, సబర్మతినగర్ బస్తీల్లో ఆయన పార్టీ యువజన విభాగం నేత ముఠా జేసింహ, డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, మాజీ కార్పొరేటర్‌లు ముఠా పద్మనరేష్, మాచర్ల పద్మజ తదితరులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుంధతినగర్‌లో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఆయా బస్తీల్లో మహిళలు బతుకమ్మలు, మంగళ హారతులతో ముఠా గోపాల్‌కు ఘనస్వాగతం పలికారు, కోలాటాలు, ఆటా, పాట డప్పు చప్పుళ్లతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ముఠాగోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ముషీరాబాద్ నియోజవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. గత 60 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేసినట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లను దండుకోవడానికి వస్తారని, వారిని కేంద్రంలో బీజేపీ, 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించాలన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అందరూ మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్



మాట్లాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్, చిత్రంలో ముఠా గోపాల్

ముషీరాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం సాయంత్రం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్‌లో తలారి శ్రీకాంత్‌ముదిరాజ్, పట్నం నరేష్, అజయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో 200 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కాసాని జ్ఞానేశ్వర్, ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్, ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను ఈ ఎన్నికల్లో గెలిపిస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ కులస్తులు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ముషీరాబాద్‌ను ముఠా గోపాల్ ఎంతో అభివృద్ధి చేశారని, ఈ ఎన్నికల్లో ఆయనకు మద్దతు ఇచ్చి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో రెండోసారి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా రెండవసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు

చిక్కడపల్లి: బీఆర్ఎస్ పార్టీకి బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్ వాసుల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందని బీఆర్ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠాగోపాల్ అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని పీపుల్స్ పార్క్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు సోమవారం ముఠాగోపాల్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించానని తెలిపారు. తనకు అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తుందన్నారు.

సీనియర్ జర్నలిస్టు ఎర్రం నర్సింగరావు ఆత్మహత్య

ముషీరాబాద్: సీనియర్ జర్నలిస్టు, వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎర్రం నర్సింగరావు సోమవారం తెల్లవారుజామున కవాడిగూడలోని బీఎస్‌నగర్‌లో గల తన నివాసంలో మెట్ల రైలింగ్ ఇనుప రాడ్డుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నర్సింగరావుకు రెండుసార్లు కరోనా సోకడంతో తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. దీనికి తోడు టీబీ కూడా సోకింది. నిత్యం ఆసుపత్రుల చుట్టు తిరగడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, సికింద్రాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్‌కుమార్‌యాదవ్, వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎన్ శ్రీనివాస్ రావు, ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, పూస రాజు, మందకృష్ణమాదిగ, జాజుల శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ మఠం అధ్యక్షులు బోధమయానంద, వి.సంధ్య, సజయ, మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్, వీరారెడ్డి, శేఖర్, పావనివినయ్‌కుమార్, రచన శ్రీలతో పాటు వివిధ ప్రజా సంఘాలు, పార్టీల నేతలు తరలివచ్చి నర్సింగరావు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆయన అంత్యక్రియలు బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో జరిగాయి. హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్‌లో నర్సింగ్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్
- మేనిఫెస్టోలో మహిళలకు ప్రాధాన్యం
- ఇందిరానగర్‌లో మహిళా బహిరంగ సభ



బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్



మాట్లాడుతున్న అంజన్ కుమార్ యాదవ్

ముషీరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ ముషీరాబాద్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్‌లోని ఇందిరానగర్‌లో మహిళల బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేవలం వారిని ఓటు బ్యాంకుగా వాడుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోలో సైతం మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోని వారి కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష దరణ లభిస్తున్నదని, ప్రచారంలో ఏక్కడికి వెళ్లిన చేతి గుర్తుకే ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపిస్తామని హామీ ఇస్తున్నారన్నారు. ముషీరాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రియాజ్, గ్రేటర్ ఉపాధ్యక్షులు మేడి సురేష్‌కుమార్, ఎండి మోహిన్ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం రాత్రి నాగమయ్యకుంటలో జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్‌కు మద్దతుగా మాట్లాడారు. అంతకు ముందు పద్మాకాలనీ, సాయిచరణ్ కాలనీ, దయానంద్‌నగర్, తదితర ప్రాంతాల్లో జరిగిన పాదయాత్రలో అంజన్‌కుమార్‌యాదవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ జనసమితి బేషరతుగా మద్దతు ప్రకటించిందన్నారు. ఆ పార్టీ నేతల విజయం కోసం ముమ్మరంగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో అధికార బీఆర్ఎస్ పార్టీలో వణుకు మొదలైందన్నారు. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల కాలంలో తాను చేసిన అభివృద్ధిపై చర్చించకుండా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పైనే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్, తెలంగాణ జన సమితి గ్రేటర్ అధ్యక్షులు ఎం.నర్సయ్య, మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు విజయ్‌యాదవ్, కరణం సురేష్, అన్సారీ, పాశం అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పన యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా



అంబర్‌పేట డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సి.రోహిణ్ రెడ్డి

అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్ రెడ్డి

అంబర్‌పేట్: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఆరు గ్యారంటీలతో ప్రతి ఓటర్ కుటుంబానికి లబ్ధి చేకురుతుందని పార్టీ అంబర్‌పేట అభ్యర్థి సి.రోహిణ్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన అంబర్‌పేట డివిజన్ బాపునగర్, చెన్నారెడ్డినగర్, నరేంద్రనగర్, హైమాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఓటర్లను కలిసి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీకి అంబర్‌పేట్‌లో ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శున్యమన్నారు. నేతల అవినీతితో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి బీఆర్ఎస్‌ను ఇంటికి సాగనంపాలని కోరారు.

అంబర్‌పేటలో కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేరు



మహంకాళి దేవాలయంలో పూజలు చేస్తున్న హరితిలక్ సింగ్.

కాచిగూడ: అంబర్‌పేటలో కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని ఆ పార్టీ అంబర్‌పేట బి బ్లాక్ అధ్యక్షుడు హరాజ్‌వాలే హరితిలక్ సింగ్ కాచి అన్నారు. సోమవారం కాచిగూడ, నింబోలిఅడ్డలోని మహంకాళి దేవాలయంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి గెలుపు కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఖైరతాబాద్ మహిళా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కోమల్ హరితిలక్ సింగ్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి టిల్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తాం..



నల్లకుంట: నల్లకుంటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతల ధనార్జున్ రెడ్డి సోమవారం టీపీసీసీ చీఫ్ ఎ. రేవంత్‌ను రెడ్డిని పెద్దమ్మ ఆలయం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సి. రోహిణ్ రెడ్డి గెలుపు కోసం రూపొందించిన ఎన్నికల ప్రచార ప్రణాళికను ఆయనకు వివరించారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా కృషిచేసి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు.

అక్కా..మీ ఓటు మాకే

దత్తన్న కుమార్తె విజయలక్ష్మికి బీఆర్ఎస్ కరపత్రం



ముషీరాబాద్: హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఆశించిన బండారు విజయలక్ష్మికి బీఆర్ఎస్ నాయకులు తమ పార్టీ కరపత్రాన్ని అందించి మద్దతు ఇవ్వాలని కోరారు. సోమవారం అడిక్‌మెట్ డివిజన్‌లో ప్రచార కార్యక్రమంలో భాగంగా దత్తాత్రేయ నివాసం ఉండే గల్లీలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, సయ్యద్ అస్లాం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అదే వరుసలో ఉన్న దత్తాత్రేయ నివాసానికి వెళ్లగా విజయలక్ష్మికి కరపత్రాన్ని అందించి ముఠా గోపాల్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆమె చిరునవ్వుతో కరపత్రాన్ని స్వీకరించి వారితో ఫొటో దిగారు. కార్యక్రమంలో నాయకులు కొండపల్లి సాయి ప్రసన్న, ఇంద్రసేనారెడ్డి, మహ్మద్ ఖదీర్, నేత శ్రీనివాస్, చంద్రశేఖర్, మహ్మద్ జహంగీర్, రోషం బాలు తదితరులున్నారు.





పూజల్లో పాల్గొన్న మంత్రి హరీష్‌రావు

వైభవంగా కోటి దీపోత్సవం

కవాడిగూడ: ఎన్‌టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న కోటిదీపోత్సవం ఏడో రోజు సోమవారం వైభవంగా జరిగింది. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పురుషోత్తమ భారతి మహాస్వామీజీ (శివగంగా మఠాధిపతి), అనుగ్రహం భాషణం వినిపించగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనామృతం వినిపించారు. ప్రధాన వేదికపై నర్మదా బాన లింగానికి కోటి భస్మార్చన పూజ నిర్వహించారు. అనంతరం అరుణాచలేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి హరీష్ రావు హాజరయ్యారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయం

- తమిళనాడు ఎమ్మెల్యే రూబీ మనోహరన్



ఇంటింటి ప్రచారం చేస్తున్న తమిళనాడు ఎమ్మెల్యే రూబీ మనోహరన్, బీఆర్ఎస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్

కవాడిగూడ: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని తమిళనాడు ఎమ్మెల్యే రూబీ మనోహరన్ అన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లో ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్‌కు మద్దతుగా దోమలగూడలోని పలు బస్తీల్లో అంజన్‌కుమార్ యాదవ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 10ఏళ్ల కేసీఆర్ పాలన పట్ల తెలంగాణ ప్రజలు విసిగిపోయారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ సర్కార్ కులమతాల మధ్య చిచ్చుపెటడం తప్ప దేశంలో చేసింది ఏమీ లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేసి తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తుందన్నారు. కార్యక్రమంలో కవాడిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతురాజు భాస్కర్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, ఏ-బ్లాక్ అధ్యక్షుడు వి.డి కృష్ణ, ముషీరాబాద్ కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు సంగపాక వెంకట్‌తోపాటు కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీజేపీకి మాజీ కార్పొరేటర్ అరుణాజయేందర్ రాజీనామా



చిక్కడపల్లి: బీజేపీ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ జి.అరుణాజయేందర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపినట్లు ఆమె పేర్కొన్నారు. తనతోపాటు దాదాపు 100 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీకి రాజీనామా చేశారని ఆమె వివరించారు. సోమవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ కాలనీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తాను పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలిని, ఒక మాజీ కార్పొరేటర్‌ను అయినా తనకు తగిన గౌరవం లేకుండా పోయిందని వాపోయారు. కనీస గౌరవం లేని పార్టీలో ఉండలేక రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. జి.జయేందర్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్‌కె శ్రీనివాస్‌ముదిరాజ్, యువజన విభాగం నాయకులు శ్రీనాథ్, శశికుమార్, జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే యువత ఆశలు సాకారం



సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగులతో సమావేశమైన ఎంపీ లక్ష్మణ్

చిక్కడపల్లి: తెలంగాణాలో నిరుద్యోగుల ఆశలు నెరవేరాలంటే, ఉద్యోగాలు రావాలంటే బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ముషీరాబాద్ అభ్యర్థి పూసరాజుతో కలిసి సోమవారం చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులను కలిసి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు తాము ఎలా మోసపోతున్నామో ఏకరువు పెట్టారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే 10 లక్షలమంది మహిళలకు ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉద్యోగాలు వచ్చేలా చేస్తామన్నారు. యూపీఎస్సీ తరహాలోనే ఏటా గ్రూప్స్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని జనాభాలో అధికశాతం ఉన్న బీసీలు, నిరుద్యోగులు బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని నిరుద్యోగులకు బాసటగా నిలుస్తామన్నారు. సమావేశంలో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్, బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

ముషీరాబాద్‌లో అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూసరాజుకు మద్దతుగా సోమవారం ఆయన చిక్కడపల్లి వివేక్‌నగర్, కాపువాడ, జవహర్‌నగర్ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు.

దీక్షితార్ కృతులను పరిరక్షించుకోవాలి

చిక్కడపల్లి: తెలుగు సంపదను పలువురు వాగ్గేయకారులు పెంపొందించారని వారిలో ముత్తుస్వామి దీక్షితార్ ప్రముఖులని ఆకాశవాణి మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మంగళగిరి ఆదిత్య ప్రసాద్ అన్నారు. ఆయన కీర్తనలు ముందుతరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సప్త స్వంగీ సంగీతాలయం, రాగవర్ష సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో ముత్తుస్వామి దీక్షితార్ రచించిన నవగ్రహ కృతుల రాగలాపన జరిగింది. పదహారు మంది శాస్త్రీయ సంగీత కళాకారులు అద్భుతంగా నవగ్రహాలను స్తుతిస్తూ పాడారు. అనంతరం త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల మాజీ ప్రిన్సిపాల్ శేషయ్యశాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో ఆదిత్యప్రసాద్ మాట్లాడుతూ అరుదైన కీర్తనలు మరుగునపడకుండా ప్రాచుర్యంలోకి తెస్తున్న సునీల శేఖర్, చంద్రశేఖర్ కృషి అభినందనీయమన్నారు.

పోలీసుల పోస్టల్ బ్యాలెట్ కోసం ఏర్పాట్లు

అంబర్‌పేట: నియోజకవర్గంలో ఓటు హక్కు ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది పోస్టర్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోరారు. సీపీఎల్ గ్రౌండ్‌లోని క్లబ్ హౌస్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాటు చేసినట్లు ఆర్‌వో అపర్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21,22 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.